
# రాబడి

# మదుపుతోనే గెలుపు





## ద్రవ్యసమీక్షపైనే..

**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*



**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్చేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

**ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు**

ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

**క్రిప్టో సిప్స్**

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

**గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్**

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.





నిందితుల అరెస్ట్‌ను చూపిన అనంతరం వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

## అక్రమంగా ఆంధ్రాకు తరలిస్తున్న జీలుగు బస్తాల పట్టివేత

- ఐదుగురిపై కేసు నమోదు, పరారీలో మరొకరు..
- 106 విత్తనాల బస్తాలు, రెండు బొలెరో వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

తొర్రూరు, జూన్ 1 : అక్రమంగా ఆంధ్రాకు తరలిస్తున్న జీలుగు విత్తనాల బస్తాలను తొర్రూరులో ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ తెలిపారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. తొర్రూరు పట్టణానికి చెందిన చలువాది ఉపేందర్ జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం ఏజెంట్ సురేశ్, బచ్చన్నపేట ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి నుంచి అక్రమంగా జీలుగు విత్తనాల బస్తాలు కొనుగోలు చేసి, తొర్రూరులోని తన నివాసంలో డంపు చేశాడు. అక్కడ విత్తన బస్తాలు మార్చి, ఆంధ్రాకు తరలించే క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు తొర్రూరు పోలీసులు ఉపేందర్ దాడి చేశారు. విత్తన బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 106 బస్తాలు పట్టుబడగా, ఒక్కో బస్తా 60కిలోలు ఉన్నది. వాటి విలువ సుమారు రూ.4.55లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో వాహనాల డ్రైవర్లు భూక్యా వీరన్న, బానోత్ సురేశ్‌తో సహా ఐదుగురు పట్టుబడగా, కేసు నమోదు చేశారు. ఆంధ్రా ప్రాంతంలోని నరసరావుపేటకు చెందిన కొనుగోలుదారుడు శేషాద్రి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అదేవిధంగా రెండు బొలెరో వాహనాలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రైతులకు నష్టం కలిగించేలా అక్రమంగా విత్తనాలు సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ విత్తన వ్యాపారాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, తొర్రూరు డివిజన్ సీఐ గణేశ్, ఆర్డీవో గణేశ్, ఏడీఏ విజయచంద్ర, ఎస్సైలు, ఉపేందర్, రమేశ్, రాజు, క్రాంతికిరణ్, ఏవో రాంనర్సయ్య, ఏఈవోలు భరత్, వినయ్ పాల్గొన్నారు.

## సభ్యత్వాల ముసుగులో అక్రమాలు

- రూ.2 కోట్లు స్వాహా.. వరంగల్ ఆఫీసర్ క్లబ్‌లో వెలుగులోకి..
- మేనేజర్ గోపాల్‌రెడ్డి, మాజీ కార్యదర్శి రాజిరెడ్డి, మరొకరి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న సుబేదారి ఇన్‌స్పెక్టర్

సుబేదారి, జూన్1 : సుబేదారి పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న వరంగల్ ఆఫీసర్ క్లబ్‌లో సభ్యత్వాల ముసుగులో కొందరు చేసిన అక్రమాలు బయటపడ్డా యి. ఎంట్రీ ఫీజు పేరుతో కోట్లు దోచుకున్న మేనేజర్ గోలి గోపాల్ రెడ్డి, మాజీ కార్యదర్శి వెంకటరాజిరెడ్డితోపాటు మరో వ్యక్తిని ఆదివారం సుబేదారి పోలీసు లు అరెస్ట్ చేశారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. గోలి గోపాల్‌రెడ్డి 2015 సంవత్సరంలో అప్పటి వరంగల్ ఆఫీసర్ క్లబ్ కమిటీ జాయింట్ సెక్రటరీ ద్వారా క్లబ్ మేనేజర్‌గా చేరాడు. అప్పటి నుంచి ఆయన క్ల బ్ ఎంట్రీ ఫీజు పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.లక్షా40వేలు తీసుకొని ఐడీ కార్డ్స్ ఇచ్చేవాడు. ఇలా ఎంట్రీ ఫీజుగా వచ్చిన రూ.కోటీ30లక్షలను క్లబ్ బ్యాంకు ఖాతాలో జమచేయకుండా సొంత అవరాల కోసం వాడుకున్నాడు. ఇవే కాకుం డా 2019లో అప్పటి క్లబ్ సెక్రటరీ వెంకటరాజిరెడ్డి కూడా కొందరి వద్ద సభ్య త్వం కోసం వసూలు చేసిన రూ.4.20 లక్షలను మేనేజర్ గోపాల్‌రెడ్డికి ఇవ్వగా, వాటిని కూడా క్లబ్ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నాడు. సభ్యత్వానికి సంబంధించిన ఇంకో రూ.60 లక్షలు మాజీ సెక్రటరీ వెంకటరాజిరెడ్డి సొంత అవసరాలకు వాడుకున్నాడు. మేనేజర్ గోపాల్‌రెడ్డి ద్వారా క్లబ్ షటిల్ బాయ్‌గా చేరిన పొడిశెట్టి రవీందర్ 14మంది సభ్యులకు సంబంధించిన సభ్యత్వం డబ్బులు రూ.10 లక్షలు సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం క్లబ్ బార్‌లో పనిచేసే శ్రీనివాస్‌కు తెలిసింది. దీంతో తెలిసిన వారిని సభ్యులుగా చేర్పిస్తే రూ.10లక్షలు కమిషన్ ఇస్తామని మేనేజర్ గోపాల్‌రెడ్డి, మాజీ సెక్రటరీ రాజిరెడ్డి, రవీందర్ ముగ్గురు కలిసి ఆశ చూపారు. చివరకు డబ్బులు ఇవ్వకపోవడంతో బార్ ఉద్యోగిగా పనిచేసే శ్రీనివాస్ గతేడాది ఏప్రిల్ 18న క్లబ్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు మేనేజర్ గోపాల్‌రెడ్డి, మాజీ కార్యదర్శి రాజిరెడ్డి, రవీందర్ కారణమని మృతుడు శ్రీనివాస్ వీడియోకాల్‌ను అతడి కుమారుడికి పంపించాడు. పూర్తి దర్యాప్తు తర్వాత మేనేజర్ గోపాల్‌రెడ్డి రూ.కోటీ 30లక్షలు, మాజీ సెక్రటరీ రాజిరెడ్డి రూ.60లక్షలు, రవీందర్ రూ.10లక్షలు తమ సొంతానికి వాడుకున్నట్లు తేలింది. ఈ ముగ్గురు 145 మంది సభ్యులకు సంబంధించిన రూ.2 కోట్లు వారి సొంతానికి వాడుకున్నట్లు తేలిందని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

### క్లబ్‌లో ఏం జరుగుతోంది?

**చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా సీపీ ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి అక్రమాలు**

వరంగల్ ఆఫీసర్ క్లబ్‌కు ఉమ్మడి జిల్లాలోనే ఓ క్రేజ్ ఉంది. హోదా, పలుకుబడి ఉన్నవారికే ఈ క్లబ్‌లో సభ్యత్వం ఇస్తారు. ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, బడా కాంట్రాక్టర్లు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంపన్న వర్గాలు కలిపి మొత్తం 1600మంది సభ్యులుగా ఉన్నారు. శారీరక దృఢత్వం కోసం ఉదయం వ్యాయామంతో పాటు షటిల్, టెన్నిస్, స్విమింగ్ చేసేందుకు చేస్తారు. అంతేగాక ప్రత్యేకంగా మద్యం సేవించేందుకు 'ఆఫీషియల్' బార్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఒక్కరికి సభ్యత్వం లక్షా 40వేలు. ఇది ఎంట్రీ కార్డు కోసమే. ఇక షటిల్, టెన్నిస్ ఆడాలన్నా స్విమ్మింగ్ చేయాలన్నా నెలకు 900 ఫీజు చెల్లించాలి. ప్రతి రెండేళ్లకోసారి క్లబ్ కమిటీని సభ్యులు ఎన్నుకుంటారు. ఈ కమిటీకి శాశ్వత చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా వరంగల్ పోలీస్ కమిషనర్ ఉన్నారు. అయితే క్లబ్ లావాదేవీలు, కార్యకలాపాలపై దృష్టిపెట్టకపోవడం వల్లే క్లబ్ నిధులు పక్కదారి పట్టినట్టు తెలుస్తున్నది కంచే చేను మేసిన విధంగా కమిటీ ప్రతినిధులే ఎంట్రీ ఫీజు పేరుతో వసూలు చేసిన కోట్లాది రూపాయలను సొంతానికి వాడుకోవడం, ఈ తతంగం సుమారు పదేళ్ల నుంచి అక్రమాలు జరుగుతున్నట్లు పోలీస్ విచారణలో తేలడం విస్తుగొల్పుతోంది. తాజాగా ముగ్గురి అరెస్టె అవినీతి భాగోతం బయటపడటంతో అసలు క్లబ్‌లో ఏం జరుగుతున్నదనే ప్రశ్న అటు సభ్యులు, బయటి వ్యక్తుల నుంచి ఉత్పన్నమవుతున్నది. ఆర్థిక లావాదేవీల రికార్డులో నమోదు చేయని విషయాలపై కొత్తగా ఎన్నికైన కమిటీలు దృష్టిపెట్టకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్లబ్ బాధ్యతల్లో మొదటినుంచీ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నందున, వారి పెత్తనం ఎక్కువై అక్రమాలు జరుగుతున్నాయని, లెక్కలు చెప్పడం లేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యత్వం కొనసాగాలంటే ఒక లక్షా 40వేలు చెల్లించాలని ప్రస్తుత కమిటీ నెలన్నర క్రితం 164మందికి నోటీసులు ఇచ్చింది. ఈ బాధితులందరూ కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**లోతుగా దర్యాప్తు చేయాలి**

**- రావుల నరేశ్‌రెడ్డి, క్లబ్ సభ్యుడు**

క్లబ్ అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. ఆర్థిక లావాదేవీల లెక్కలు తేల్చి సభ్యులకు తెలియజేయాలి. ఇందుకు జిల్లా ఉన్నత అధికారులు వెంటనే స్పందించి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, అవినీతికి పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలి.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

చెన్నారావుపేట, జూన్1 : విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన చెన్నారావుపేట మండలం కల్‌నాయక్‌తండా పరిధి బాల్‌నాయక్‌తండాలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్‌నాయక్‌తండాకు చెందిన బానోత్ బాలు(45) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి తండాలోని వ్యవసాయ బావి వద్ద మోటర్ ఫీజ్ సరి చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

## మేడారంలో ఘనంగా విత్తన పండుగ



వనభోజనాలకు తరలివెళ్తున్న పూజారుల కుటుంబాలు

తాడ్వాయి, జూన్1: మేడారంలో ఆదివారం సమ్మక్క దేవత పూజారులు విత్తన పండుగను ఘనంగా నిర్వహించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు, వారి కుటుంబ సభ్యులు వేకువజామున సమ్మక్క తల్లి పూజామందిరంలో, గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య అటవీ ప్రాంతంలోకి వనభోజనాలకు వెళ్లారు. ప్రకృతి దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. ఆదివాసీల వ్యవసాయ పంటలకు మేలైన కార్తెల ప్రారంభాన్ని ఎండిన ఇప్పపువ్వుల ద్వారా గ్రామపెద్దలు నిర్ణయించారు. నేటి నుంచి విత్తనాలు నాటుకోవడం, పంటలు సాగుచేయడం వంటివి ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా వచ్చే ఏడాది మాఘశుద్ధ పౌర్ణమి నాడు అమ్మవార్ల మహాజాతర నిర్వహించే తేదీలను సైతం నిర్ణయించారు. త్వరలోనే తేదీలను పూజారులు ప్రకటించనున్నారు.

## ధాన్యం బస్తాలు మాయం

**పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు**

చిన్నగూడూరు, జూన్ 1 : చిన్నగూడూరు మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన నామ సునీతారాజు, కోల లచ్చమ్మాశ్రీనుకు ఈ విషయమై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 9న సునీతకు చెందిన 84 బస్తాలు(33.60క్వింటాళ్లు), నామ సునీతకు చెందిన 38 బస్తాలు (15.20క్వింటాళ్లు) మొత్తం 122 బస్తాల ధాన్యం కాంటా వేశారు. 10న ట్రాక్టర్ ద్వారా మిల్లులకు తరలించారు. పది రోజుల తర్వాత ఆన్‌లైన్ చేస్తామని, 110 బస్తాలకు డబ్బులు వస్తాయని, ఓటీపీ చెప్పమని మరిపెడ చారి అనే వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో రైతులు ఖంగుతిన్నారు. మిగతా 12 బస్తాల ధాన్యం ఏమైందంటూ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు పట్టించుకోకపోవడంతో తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామని బాధిత రైతులు తెలిపారు.

## రేషన్ బియ్యం తరుగు

- గోదాము నుంచి తీసుకెళ్లిన బస్తాల్లో తక్కువ రైస్
- ఇబ్బంది పడుతున్న డీలర్లు.., ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం శూన్యం
- గోడౌన్ వద్ద వే బ్రిడ్జి కాంటా వేసి ఇవ్వాలంటున్న డీలర్లు




గార్ల రేషన్ షాపుల గోదాము వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు (ఫైల్)

డోర్నకల్, జూన్ 1 : గోదాము నుంచి తీసుకెళ్లిన 50 కిలోల రేషన్ బియ్యం బస్తాలో కిలో నుంచి మూడు కిలోలు తక్కువ వస్తున్నాయి. ఉన్నతాధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదని, దీంతో తాము ఇబ్బంది పడుతున్నామని డీలర్లు వాపోతున్నారు. గోడౌన్ వద్దే వే బ్రిడ్జి కాంటా వేసి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు గార్ల ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ప్రతి నెల బియ్యం సరఫరా అవుతుంటాయి. 50 కేజీల బియ్యం బస్తాలో కేజీ నుంచి మూడు కేజీలు వరకు ప్రతి నెలా తరుగు వస్తున్నాయి. ఈ విషయాన్ని డీలర్లు జిల్లా అధికారులకు చెప్పడంతో గోదాం వద్ద కాంటా వేసి ఇవ్వాలని గోదాం ఇన్‌చార్జిని ఆదేశించినా అతడు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం సన్న బియ్యం ఇవ్వడంతో రేష న్ కార్డు లబ్ధిదారులు క్రమం తప్పకుండా తీసుకెళ్లడంతో మిగిలిన స్టాక్ వివరాలు తక్కువగా ఉండడంతో తమపై భారం పడుతుందని డీలర్లు అంటున్నారు. ప్రతి నెల ఒక కోటాలో సుమా రుగా క్వింటా వరకు బియ్యం తరుగు వస్తున్నాయి. ఉన్నతాధికారులు తనిఖీ చేసినప్పుడు స్టాక్ వివరాలు ఏవ చెప్పాలో అర్థం కావడం లేదని డీలర్లు అంటున్నారు. గోదాం వద్ద వేబ్రిడ్జి కాంటా వేసి ఇవ్వాలని డీలర్ల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గార్ల బియ్యం గోదాం ఇన్‌చార్జి ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. అని బెదిరిస్తున్నాడని, తమ సమస్యను పరిష్కరించాలని డీలర్లు కోరుతున్నారు.

**రేషన్ బియ్యం కాంటా వేసి ఇవ్వాలి..**

రేషన్ బియ్యం తరుగు వస్తున్నాయి. గోదాం వద్ద వే బ్రిడ్జి కాంటా వేసి ఇవ్వాలి. బస్తాకు ఒకటి నుంచి మూడు కేజీల వరకు తరుగు రావడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు.

**– తేజావత్ లక్ష్మా, రేషన్ డీలర్ల అసోసియేషన్ డోర్నకల్ మండల అధ్యక్షుడు, మన్నెగూడెం**

## ప్రశాంతంగా ఎడ్‌సెట్

**పరీక్ష రాసిన 32,106 మంది అభ్యర్థులు**



కేయూలో ఎడ్‌సెట్ పరీక్షను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 1 : 2025-26 విద్యాసంవత్సరానికి బీఈడీ కోర్స్‌లో ప్రవేశాల కోసం ఆదివారం టీజీ ఎడ్‌సెట్-2025 నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సెషన్-1 కోసం సెట్ 'ఎ', టీజీ ఎడ్‌సెట్-2025 చైర్మన్ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె ప్రతాప్‌రెడ్డి సెషన్-2 కోసం సెట్ 'బి' పరీక్ష పత్రాల 'పాస్‌వర్డ్' ను రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రామచంద్రం, కన్వీనర్ ఆచార్య వెంకట్రామరెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఆచార్యులు పురుషోత్తం, మొహమ్ముద్, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేశ్, విద్యావిభాగ డీన్ ఆచార్య ఎం రామనాథ కిషన్, యూనివర్సిటీ ఆచార్యులు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మనోహర్, దూరవిద్యా కేంద్ర సంచాలకుడు ఆచార్య బీ సురేశ్‌లాల్, డాక్టర్ నరేందర్ సమక్షంలో విశ్వవిద్యాలయంలోని టీజీ ఎడ్‌సెట్-2025 కార్యాలయంలో ఆదివారం ఉదయం 8 గంటలకు విడుదల చేశారు. రెండు సెషన్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 74, మధ్యాహ్నం 73 ప్రాంతీయ కేంద్రాల్లో 38,758 అభ్యర్థులు నమోదు చేసుకోగా, 32,106 మంది హాజరై పరీక్ష రాశారు. 83శాతం హాజరు నమోదైంది. వరంగల్ నగరంలోని మోక్షితా ఇనిస్టిట్యూట్, బొల్లికుంట వాగ్దేవి కాలేజీ, హనుమకొండలోని అయాన్ ఇనిస్టిట్యూట్, జయ కాలేజీ, సుమతిరెడ్డి కాలేజీ, వాగ్దేవి హనుమకొండ, నోబెల్ ఇనిస్టిట్యూట్‌తో పాటు పలు పరీక్షా కేంద్రాలను స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, వైస్ చాన్సలర్ ఆచార్య ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, వైస్ చైర్మన్లు పురుషోత్తం, ఆచార్య మొహమ్ముద్, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేష్‌తో కలిసి సందర్శించినట్లు కన్వీనర్ వెంకట్రామరెడ్డి వెల్లడించారు.